## క్లుప్తంగా

### క్రీడామైదానం చదును



**ఆత్మకూరు:** మండలంలోని గూడెప్పాడ్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం బురదమయంగా మారడంతో స్పందించింది. దీంతో మండలంలోని మల్కపేట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బుస్స శివ సొంత ఖర్చులతో కంకర పోయించి చదును చేయించారు. కాగా, శివకు ప్రిన్సిపాల్ అనిత కృతజ్ఞతలు తెలిపారు.

### అనుమతి తీసుకోవాలి

**శాయంపేట:** వినాయక మండపాల నిర్వాహకులు విద్యుత్ అధికారుల అనుమతితోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ చందులాల్ గురువారం తెలిపారు. వినాయక మండపాల వద్ద స్టాండర్డ్ వైర్, బ్రేకర్ పెట్టుకొని సర్వీస్ వైర్ పోల్ మీద కనెక్షన్ పెట్టించుకోవాలని తెలిపారు. నిబంధన ప్రకారం లేని విద్యుత్ కనెక్షన్లు తొలగించనున్నట్లు తెలిపారు.

### కాంగ్రెస్ నాయకుడి మృతి



**పరకాల:** బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేత, కాంగ్రెస్ నాయకుడు, వైఎస్సార్ వీరభిమాని పూజారి సాంబయ్య (56) గురువారం మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాంబయ్యకు గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాంబయ్య మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు ఆముదాపల్లి మల్లేశం, నాయకులు నివాళులు అర్పించారు.

### ఆర్థిక సాయం



**పరకాల:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరకాల మున్సిపల్ జవాన్ కిశోర్ పెద్ద కుమారుడు శశాంక్‌కు 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి గురువారం రూ.10వేలు అందజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడి ప్రాణాలు కాపాడేందుకు తన వంతు సాయం అందజేసినట్లు పూర్ణచారి తెలిపారు.

### వితంతువులతో ఆత్మీయసమ్మేళనం



**ఆత్మకూరు:** మండలకేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో గురువారం మైత్రాసన సంస్థ ఆధ్వర్యంలో వితంతువుల ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మైత్రాసన పాలనాధికారి విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వితంతువులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం వారికి కానుకలు అందచేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఐ అధ్యక్షుడు సంపతిబాలరాజు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కేయూ క్యాంపస్ :** సోమిడిలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల న్యాయ కళాశాలలో బోధించేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎల్ఎల్ఎంలో 55శాతం మార్కులు ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, పీహెచ్‌డీ, నెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించాలని, డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# అడుగుకో గుంత

- 2023లో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- రెండేళ్లు గడిచినా పూర్తికాని వైనం
- గ్రీవెన్స్‌లో ప్రజల ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వాహనదారులకు తప్పనితిప్పలు





గుంతల్లో నీరునిలిచి అధ్వానంగా ఉన్న రోడ్డు

**ఐనవోలు:** మండలంలోని కొండపర్తి – వరంగల్, కొండపర్తి – కాజీపేటకు మధ్య రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజీపేట దర్గా నుంచి భట్టుపల్లి, కొత్తపల్లి, కొండపర్తి మీదుగా గుంటూరుపల్లి వరకు సుమారు 7.5 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు అక్టోబర్ 2023లో మంజూరైంది. సీడీఎఫ్ నిధులు రూ.5.69 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన ఈ రోడ్డుకు 2023 అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మొదట్లో మొరం, కంకర పనులు కొంతమేర చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కాగా ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది. ఈ మార్గంలో కంకర తేలడం, గుంతలు పడటంతో నిత్యం వాహనదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. రాత్రిపూట ఈ దారిలో వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. గ్రామం నుంచి నగరానికి వెళ్లడానికి సుమారు 80 ఆటోలు ఉన్నాయి. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం కావడంతో గిరాకీ తగ్గి ఇబ్బందులు పడుతుండగా.. రోడ్డు సరిగా లేక ఆటోలు తరచూ రిపేర్లు వస్తుండటంతో గిట్టుబాటు కాక ఆర్థికంగా చితికిపోతున్నట్లు ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. గ్రామస్తుల సహకారంతో ఆటో యూనియన్ నాయకులు ఓ సారి గుంతల్లో మొరం పోశారు. పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. త్వరలో రోడ్డుపై ధర్నాకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగటానికి వచ్చే నాయకులకు బుద్ధిచెబుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### ప్రభుత్వానిదే బాధ్యత



కొండపర్తి నుంచి కొత్తపల్లి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. రోడ్డు మంజూరై రెండేళ్లు గడిచినా పురోగతి లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జరుగకూడనిది జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. పట్టించుకోకపోతే స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధిచెబుతాం.

– మాదాసు ప్రణయ్, కొండపర్తి

### రోడ్డు పనులు పూర్తి చేయాలి



గ్రామం నుంచి వరంగల్, కాజీపేటలకు నిత్యం వందలాది మంది వెళ్తుంటారు. ఇరు మార్గాల్లో బీటీ రోడ్డు అధ్వానంగా ఉంది. గ్రామస్తుల సహకారంతో గతంలో మొరం పోసుకుని తాత్కాలికంగా ఆటోలు నడుపుకున్నాం. మళ్లీ రోడ్డు గుంతలమయం కావడంతో ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే పట్టించుకుని త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయించాలి.

– సాంబరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు, కొండపర్తి

# గణపతి నిమజ్జనానికి డీజే అనుమతి లేదు



శాయంపేట: నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ



దామెర: కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై అశోక్

- శాయంపేట సీఐ రంజిత్ రావు

**శాయంపేట :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ నిమజ్జనాలకు డీజే అనుమతులు లేవని శాయంపేట సీఐ రంజిత్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో డీజె నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ రావు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతారణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనంలో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎవరైనా డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని వినాయక మండపాలని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

**దామెర:** గణపతి నవరాత్రులకు డీజేలకు అనుమతిలేదని, ఎవరైనా వాటిని ఏర్పాటుచేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. మండలంలోని డీజే నిర్వాహకులకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గణపతి మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో డీజేలను పెట్టొద్దని సూచించారు. నిమజ్జన సమయంలో ఎవరైనా గొడవలకు దిగితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని 14 మంది డీజే నిర్వాహకులను తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి ఎదుట బైండోవర్ చేశారు.



వేలేరు: సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

**డీజే నిర్వాహకుల ముందస్తు బైండోవర్**

**వేలేరు:** వినాయక నవరాత్రుల సందర్భంగా మండలంలోని డీజే నిర్వాహకులతో ఎస్సై అజ్మీరా సురేష్ గురువారం సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనంలో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, నిర్వాహకులు డీజే సౌండ్ సిస్టంను అద్దెకు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ హెచ్.కోమి ఎదుట డీజే నిర్వాహకులను బైండోవర్ చేశారు. ఇదిలా ఉండగా.. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని తహసీల్దార్ హెచ్.కోమీ, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎస్సై సురేష్ నిర్వహించారు. విద్యుత్ సౌకర్యాలు, శాంతిభద్రతలు, నిమజ్జనం రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

# ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి

- ఎంపీడీఓ గుమ్మడి కల్పన



దామెరలో జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

**దామెర:** ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ గుమ్మడి కల్పన అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో డ్రాఫ్ట్ జాబితాను గురువారం ప్రచురించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 14 గ్రామపంచాయితీల్లో మొత్తం 21,883మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 10,569 మంది పురుషులు.. 11,314 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా 132 వార్డులకుగాను 132 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు ఆమె వెల్లడించారు. ఈ నెల 30న ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆమె వెంట ఎంపీఓ రంగాచారి, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ఓటరు జాబితా ప్రదర్శన**

**వేలేరు:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్, పోలీంగ్ స్టేషన్‌ల జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీలోపు తెలపాలని కోరారు. అదే రోజున మండలంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 2న తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

**భీమదేవరపల్లి మండలంలో..**

**ఎల్కతుర్తి:** సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో భాగంగా భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం పోలింగ్ కేంద్రాల ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ వీరేశం తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 41,898 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను వెలువరిస్తామని పేర్కొన్నారు. నేటి నుంచి ఈ నెల 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి, సెప్టెంబర్ 2న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని 25 గ్రామాల్లో 20,444 మంది పురుషులు, 21,454మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. ఆగస్టు 30న వివిధ రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# మహిళా సంఘాలకు స్టీల్ సామగ్రి పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న మంజుల

**ఎల్కతుర్తి:** భీమదేవరపల్లి మండలంలోని భరత మాత మండల సమాఖ్య కార్యాలయం, ఎల్కతుర్తి స్త్రీశక్తి భవనంలో గురువారం పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి గ్రామైక్య మహిళా సంఘాలకు స్టీల్ సామగ్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నియంత్రణ కోసం పొన్నం ప్రభాకర్ చేపట్టిన స్టీల్ బ్యాంకు ఉద్యమం చాలా గొప్పదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య సంరక్షణను కాపాడేందుకే స్టీల్ బ్యాంకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు వేణు, రవీందర్, షబానా, నాగమణి, బాలసుందర్, సదానందం, కరుణాకర్, ఐలయ్య, ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మోర్తాల చందర్‌రావు



పత్తి పంటను పరిశీలిస్తున్న చందర్‌రావు

**నంగెం :** తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న నష్టపోయిన రైతులను పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గవిచర్లలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలతోపాటు కూరగాయల, పండ్ల తోటలను గురువారం ఆయన ఆధ్వర్యంలోని సందర్శించి నష్టాన్ని అధ్యయనం చేసింది. అనంతరం చందర్‌రావు మాట్లాడారు. వర్షాలకు వందలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. దెబ్బతిన్న పంటలకు పత్తి, మొక్కజొన్న ఎకరాకు రూ.25 వేలు, కూరగాయలు, పండ్ల తోటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని సూచించారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని చెప్పారు. బాషిపాక రమేశ్, బల్పుకూరి నర్సయ్య, మాదం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఉండ్రాళ్లయ్య ఉత్సవాలు షురూ..

- వినూత్న రూపాల్లో వినాయక విగ్రహాలు
- పూజలందుకుంటున్న గణపయ్య
- భక్తిపారవశ్యంలో భక్తులు

వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో వాడవాడలా వినూత్న రూపాల్లోని వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు వినాయక మండపాల వద్ద భక్తి పాటలతో పరవశించిపోతున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు: ఆత్మకూరులో పోచమ్మసెంటర్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద భక్తులు



కమలాపూర్ :పూజలో పాల్గొన్న యువకులు



దామెర: యాదవ సంఘం ఆధ్వర్యంలో..



ఐనవోలు: వినాయక చవితి సందర్భంగా మల్లన్న ఆలయంలో పూజచేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



వేలేరు: మండలంలోని పీచర గ్రామంలో..



ఎల్కతుర్తి : వీరనారాయణపూర్‌లో..



ధర్మసాగర్: పూజ చేస్తున్న భక్తులు

## చోరీ నిందితులు మైనర్లే..

- వివరాలు వెల్లడించిన సీఐ సంతోష్



ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు

**ఆత్మకూరు:** ఇటీవల మండలంలోని పెద్దాపూర్, నీరుకుళ్ల శివారు కందిబండ గ్రామాల్లో రెండు బైక్‌లు మాయమైన విషయం తెలిసిందే. అయితే ఈ చోరీలకు పాల్పడింది ఓ మైనర్లుగా పోలీసులు గుర్తించారు. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై జల్సాలకు అలవాటుపడిన నలుగురు బాలురు కందిబండ గ్రామంలో ఈనెల 24న బైక్ చోరీ చేశారు. అదే రాత్రి పెద్దాపూర్‌లో మరో బైక్ చోరీ చేశారు. గురువారం ఆత్మకూరు పోలీసులు అక్కంపేట ఆర్చ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా నలుగురు బాలురు అనుమానాస్పదంగా కన్పించడంతో ఆరా తీయగా.. చోరీచేసినట్లు ఒప్పుకున్నారు. వీరు గతంలో కూడా మోటార్లను చోరీ చేశారు. వీరిని అదుపులోకి తీసుకొని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ వెల్లడించారు. సీఐ వెంట ఎస్సైలు తిరుపతి, సతీష్ ఉన్నారు.

# చెత్తాచెదారం డ్రెయినేజీల్లో వేయొద్దు

- ఎంపీడీఓ గుండె బాబు



గుండేడులో వరద నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**కమలాపూర్:** చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను డ్రెయినేజీల్లో వేయొద్దని ఎంపీడీఓ గుండె బాబు మండల ప్రజలకు సూచించారు. చెత్తా, చెదారం, ప్లాస్టిక్ వస్తువులను డ్రెయినేజీల్లో వేయడం ద్వారా నాళాలు, డ్రెయినేజీల్లో వరద, మురుగు నీరు సక్రమంగా వెళ్లకుండా పేరుకుపోయి వరద, వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతోందని అన్నారు. మండలంలోని గుండేడు ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు నిలిచిపోయిందన్న సమాచారం మేరకు గురువారం ఆయన పాఠశాలను సందర్శించి గ్రామ పంచాయతీ సిబ్బందితో డ్రెయినేజీని శుభ్రం చేయించి పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీటిని బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న రెండ్రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లోంచి బయటకు వెళ్లొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు డ్రెయినేజీల్లో చెత్తా, చెదారం లేకుండా చూసుకోవాలని, రోడ్ల వెంట, డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పంచాయతీ కార్యదర్శులు సకాలంలో స్పందించి వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించాలనిఆదేశించారు.

**గణపతి నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయాలి**

గణపతి నవరాత్రుల అనంతరం నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గుండె బాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై మధుతో కలిసి గురువారం ఆయన కమలాపూర్ పెద్ద చెరువులో గణపతులను నిమజ్జనం చేసే ప్రదేశాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# నాణ్యమైన విద్య అందిస్తున్నాం..

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

**కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని, ప్లేస్‌మెంట్ ట్రాక్ ఉన్న కళాశాల కూడా అని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థినులకు వారి తల్లిదండ్రులకు గురువారం పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో ఒరియేంటేషన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్, డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీ అని అన్నారు. నిట్ వరంగల్ ప్రొఫెసర్ శైలజాకుమారి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌లోని అన్ని కోర్సులకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఏటా ఆఖరు సంవత్సరంలో ప్లేస్‌మెంట్స్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మాట్లాడుతూ.. కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు మంచి ప్లేస్‌మెంట్ రికార్డు ఉందని, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ లు కూడా ఉన్నాయని తెలిపారు. అధ్యాపకులు వాణిశ్రీ, రచన మాట్లాడారు. తొలుత రిజిస్ట్రార్ జ్యోతిప్రజ్వలన చేశారు. అధ్యాపకులు, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పసరగొండలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాకేశ్

**దామెర:** వరిపొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అల్లె రాకేశ్ అన్నారు. మండలంలోని పసరగొండలో గురువారం ఆయన వరి పొలాలను పరిశీలించి, మాట్లాడారు. ప్రస్తుతం వరిలో మొగిపురుగు ఉధృతిని గుర్తించినట్లు తెలిపారు. ఈ పురుగు నివారణకు ఎకరానికి 8 కిలోల కార్బోఫ్యురాన్ త్రీజీ గుళికలు 20 కిలోల ఇసుకలో కలుపుకొని చల్లాలని పేర్కొన్నారు. లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సుడిదోమ నివారణకు ఏసీఫేట్75 డబ్ల్యూపీ 250 గ్రాములు ఎకరానికి లేదా ఇమిడాక్లోప్రైడ్ 100 ఎంఎల్ వేపనూనె 500 ఎంఎల్ కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని వివరించారు. ఆయన వెంట ఏఈఓ రామకృష్ణ, రైతులు శనిగరం సుధాకర్, సంతోష్, కుమారస్వామి, సాంబయ్య తదితరులు ఉన్నారు.